ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల
జిల్లా వార్తలు

5

శనివారం 3 ఆగస్టు 2024





23వ వార్డులో టెండర్ నిర్వహించకుండా నిర్మిస్తున్న సీసీ రోడ్డు

- అభివృద్ధి పనుల్లో పాలకవర్గం ఇష్టారాజ్యం
- ఆన్‌లైన్ టెండర్ల నిబంధనలు గాలికి
- గడువు ముగియకుండానే ముందస్తు పనులు
- మరో పనికింద మార్చుకుంటామంటున్న అధికారులు



నిబంధనలు బేఖాతరు

మంచిర్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో అధికారులు, కౌన్సిలర్ల ఇష్టారాజ్యం నడుస్తోంది. ప్రతీ పనికి ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో ఆన్‌లైన్ టెండర్లు పిలవాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టడం ఇక్కడ ఆనవాయితీగా మారింది. ఓ వైపు టెండర్లు ఆహ్వానించి, ఆ గడువు కూడా ముగియక ముందే పనులు పూర్తి చేయడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత మాత్రానికి టెండర్లు పిలవడం దేనికన్న ప్రశ్నలు ప్రజల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. రెండు నెలల క్రితం రద్దయిన టెండర్లు రీకాల్ చేసినప్పటికీ...అందులోనూ నిబంధనలు విస్మరించడం హాస్యాస్పదంగా మారింది.

సిండికేట్ కోసం యత్నించి..

పట్టణ పరిధిలోని వివిధ వార్డులలో పలు అభివృద్ధి నిమిత్తం దాదాపు రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో 45 పనులకు 28-06-2024న ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానించారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి ఒక్కో వార్డుకు రూ. 5 లక్షల చొప్పున డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహించాల్సి ఉండగా, ఆఫ్‌లైన్‌లో పనుల పంపకానికి తెర లేపారు. ఆన్‌లైన్ టెండర్లు వేసేందుకు జూలై 5న సాయంత్రం వరకు గడువు ఉండగా, కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చే ఉద్దేశ్యంతో ఒక రోజు ముందు గానే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి లక్కీ డ్రా పద్ధతిన పనులు పంచుకున్నారు. స్టీల్ బాక్సుల్లో వార్డుల నంబర్లు, కాంట్రాక్టర్లతో పేరుతో కూడిన చీటీలను వేసి డ్రా తీసి పనులు ప్రకటించుకున్నారు. డ్రాలో వచ్చిన విధంగా కాంట్రాక్టర్లు వార్డుల వారీగా టెండర్లు వేయాలని నిర్ణయించుకున్నారు.

ఇదిలా ఉండగా డ్రాలో పనులు లభించని కాంట్రాక్టర్లు కొందరు చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేష్‌ల సమక్షంలోనే ఒకరితో ఒకరు వాగ్వివాదానికి దిగారు. స్థానికులు కాదనే నెపంతో పనులు అప్పగించక పోవడంపైనా వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ విషయంపై స్థానికంగా చర్చ జరుగడం, పత్రికల్లో వార్తలు రావడంతో అధికారులు టెండర్లను రద్దు చేశారు.

గడువు ముగియక ముందే..

గత నెలలో రద్దయిన టెండర్లను రీకాల్ చేయగా శుక్రవారం వరకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్ దాఖలుకు గడువు ఇచ్చారు. సాయంత్రం 5.30 గంటల వరకు టెండర్లు దాఖలు చేసుకొనె వెసులుబాటు ఉంది. శుక్రవారంతో టెండర్ల దాఖలు గడువు ముగిసిన తరువాత ఒకటి రెండు రోజుల్లో వాటిని తెరిచి తక్కువ కోట్ చేసిన కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసిన అనంతరం నిబంధనల మేరకు పనులు అప్పగించాల్సి ఉంటుంది. కాగా 23 వార్డులో రూ. 4,04,108 అంచనా వ్యయంతో టెండర్ ఐడీ 530859 ప్రకారం సీసీ కల్వర్టు, డ్రైన్ నిర్మాణం కోసం టెండర్ ఆహ్వానించారు. ఈ పనికి టెండర్ వేసేందుకు సాయంత్రం 5.30 వరకు సమయం ఉంది. కాగా ఆ సమయానికి ముందే హడావు డిగా ఏకంగా పనులు పూర్తి చేయడం గమనార్హం. సంజీవయ్య కాలనీలోని స్లాటర్ హౌజ్ వరకు పాత డ్రైనేజీపైన కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మించారు. ఈ పనులకు ఎలాంటి వర్క్ అగ్రిమెంట్ లేకపోవడం కొసమెరుపు. అలాగే అదే వార్డులో టెండర్ ఐడీ నెంబర్ 530975 ప్రకారం బైపాస్ రోడ్డు నుంచి స్లాటర్ హౌజ్ వరకు రూ. 1,61,172లతో ర్యాంప్ నిర్మాణానికి టెండరు ఆహ్వానించారు.

అయితే ఈ పని ఇంతకు ముందే పూర్తికాగా, మళ్లీ టెండర్లు పిలవాల్సిన అవసరం ఏమొచ్చిందో అధికారులకే తెలియాలి. ఒకవేళ ప్రజలకు అత్యవసరమైతే ఎలాంటి టెండర్లు పిలవకుండానే ముందస్తుగా పనులు చేపట్టే వెసులుబాటు స్థానిక సంస్థలకు ఉంది. అయితే ఇక్కడ టెండర్లు ఆహ్వానించి, దాఖలు గడువు కూడా ముగియక ముందే అత్యవసరంగా పనులు చేపట్టడంలో మతలబేమిటో అంతు చిక్కకుండా ఉంది. పైగా ఆ ప్రదేశంలో కల్వర్టు, సీసీ రోడ్డు అంత అత్యవసరం కూడా కాదు. అయినా నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ విషయమై మున్సిపల్ ఇంజనీర్ రాజేందర్‌ను వివరణ కోరగా 23 వార్డులో కొనసా గుతున్న పనులు గతంలో రద్దయిన టెండర్లకు సంబంధించినవేనని చెప్పారు. టెండర్లు ఆహ్వానించిన ప్రకారం మరో చోట పనులు చేపడుతామని తెలిపారు. గతంలో రద్దయిన టెండర్లకే రీకాల్ చేసినప్పుడు, ఆ పనులు కూడా రద్దవుతాయన్న విషయం తెలిసినప్పటికీ మున్సిపల్ అధికారులు మరోచోట పనులు చేపడతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.

జియో థర్మల్ క్షేత్రంగా మణుగూరు

- అన్వేషణ, అభివృద్ధిపై సింగరేణి ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న సీఎండీ, కంపెనీ ప్రతినిధులు

శ్రీరాంపూర్, ఆగస్టు 2: జియో థర్మల్ క్షేత్రంగా మణుగూరు నిలువనుంది, మణుగూరుకు సమీపంలోని పగిడేరు వద్ద భూగర్భంలో విస్తారంగా ఉన్న భూతాప(జియో థర్మల్) క్షేత్రంలో అన్వేషణ, అభివృద్ధిపై సింగరేణి కాలరీస్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎన్‌జీసీ), తెలంగాణ రిన్యూవబుల్ ఎనర్జీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(తెలంగాణ రెడ్కో) మధ్య శుక్రవారం సింగరేణి భవన్‌లో త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ మేరకు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్, ఓఎన్‌జీసీ డైరెక్టర్(ఎక్స్‌ప్లోరేషన్) సుష్మా రావత్, తెలంగాణ రెడ్కో జీఎం సత్య వరప్రసాద్ ఒప్పందంపై సంతకాలు చేశారు. 2070 నాటికి సంపూర్ణ కార్బన్ ఉద్గార రహిత విద్యుత్ ఉత్పత్తి చేయాలని దేశం లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. అనంతరం సింగరేణి సీఎండీ ఎన్ బలరాం మాటాడుతూ మణుగూరులో 122 మెగావాట్ల జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. ఈ మేరకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ఇచ్చిందన్నారు. ఈ మేరకు తాము ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఓఎన్‌జిసి డైరెక్టర్ సుష్మా రావత్ మాట్లాడుతూ, మణుగూరు దేశంలోనే అతిపెద్ద జియో థర్మల్ కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రెడ్కో జీఎం సత్య వర ప్రసాద్ మాటాడుతూ, క్లీన్ ఎనర్జీ ప్రోత్సాహం దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంస్థలను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు డి. సత్యనారాయణ, ఎన్.వి.కె. శ్రీనివాస్, జి. వెంకటేశ్వర్ రెడ్డి, జీఎం(ఆర్ అండ్ డి) ఎస్.డి.ఎం. సుభాని, జీఎం(కో-ఆర్డినేషన్) జి. దేవేందర్, ఓఎన్‌జిసి పక్షాన జీజీఎం గోపాల్ జోషి, జీఎం సంజయ్ కుమార్ ముఖర్జీ, చీఫ్ మేనేజర్ రమేష్, అనూప్ భరద్వాజ్ పాల్గొన్నారు. కాగా సింగరేణిలోని అన్ని ఏరియాల్లో కలిపి రోజుకు 2 లక్షల టన్నులు ఉత్పత్తి చేయాలని సీఎండీ ఎన్ బలరాం ఆదేశించారు. శుక్రవారం ఆయన అన్ని ఏరియాలకు చెందిన జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

బెల్లంపల్లి, ఆగస్టు 2: పట్టణంలో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ గదుల విషయంలో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నూతన కూరగాయల మార్కెట్ భవనంలో 108గదులకు గాను 54 మందికి కేటాయించామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా కూరగాయల వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారులను సీనియారిటీ ప్రకారం ఎంపిక జరిగిందని తెలిపారు. మిగితా గదులను లక్కీడ్రా ద్వారా కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేయాలి

హాజీపూర్, ఆగస్టు 2: మండలంలోని ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూముల విస్తీర్ణాన్ని సర్వే చేసి బోర్డులను ఏర్పాటు చేయాలని బీజేపీ మండల నాయకులు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, మండల అధ్యక్షుగు గడ్డం స్వామిరెడ్డి, నాయకులు మోటపలుకుల తిరుపతి, మాధవరపు వెంకటరమణరావు, మడిపెల్లి సత్యం, శేఖర్, మల్లేష్, శ్రీనివాస్, రాజనర్సు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, బాపు, గట్టయ్య పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 2: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో కొన్నేళ్ల క్రితం స్థిర నివాసాలు ఏర్పర్చుకున్న శ్రీరాంపూర్‌వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, 17వ వార్డు కౌన్సిలర్ మేకల దాసు కోరారు. ఈ మేరకు ఆయన కొత్తగూడెం శాసనసభ్యుడు, సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావును శాసనసభలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికులు, కార్మికేతరులు సింగరేణి స్థలంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటే 76 నెంబర్ జీవోను అనుసరించి వారికి ప్రభుత్వం ద్వారా ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. కానీ అదే ఏరియాలో ఉన్న హిమ్మత్‌నగర్, సుందరయ్య నగర్, కృష్ణమూర్తినగర్, అంబేద్కర్‌నగర్, సాయిబాబా గుడి ఏరియా, అంబేద్కర్‌నగర్, రాజీవ్‌నగర్, హన్మాన్‌నగర్, సాయినగర్, బుడగజంగాలకాలనీ, కృష్ణాకాలనీల్లో పట్టాలు ఇవ్వలేదన్నారు. ఆయనవెంట సీపీఐ సింగాపూర్-శ్రీరాంపూర్ గ్రామ కార్యదర్శి పూజారి రామన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి మహేష్, కోశాధికారి కూన సాయి కిరణ్ ఉన్నారు.

రిజర్వేషన్‌లు అమలు చేసిన ఘనత చంద్రబాబుదే



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 2: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లను రెండు దశాబ్దాల క్రితం అమలు చేసిన ఘనత ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ అన్నారు. మందమర్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు రిజర్వేషన్‌లపై తీర్పునివ్వడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం చంద్రబాబు నాయకుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు వాసాల సంపత్, రాష్ట్ర మహిళ కార్యదర్శి ఎండీ షరీఫా, పట్టణాధ్యక్షురాలు ఆర్. విజయ.నాయకులు శ్రీనివాస్, సంధ్య, కవిత, రాజేష్, గణపతి, జయశంకర్, లావణ్య, రాజేష్, భారతి, స్వప్న పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 2: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీసీపీ ఏ భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన ఏసీపీ ఆర్.ప్రకాష్‌తో కలిసి మార్కెట్, ప్రధాన కూడళ్లను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా షాపుల యజమానులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వారి వెంట పట్టణ సీఐ బన్సీలాల్, ట్రాఫిక్ సీఐ బి.సత్యనారాయణ, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

● సంక్షిప్తం..

● ఏసీసీ: ప్రభుత్వ ఐటీఐలలో మూడో దఫా అడ్మిషన్‌ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ను ఆహ్వానిస్తున్నట్లు మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జీప్రిన్సిపాల్ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో అడ్మిషన్‌పొందడానికి ఈ నెల12లోగా ఆన్‌లైన్ ఐటీఐ.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

● నస్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి అధ్వర్యంలో సీసీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

● శ్రీరాంపూర్: యువత, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ అన్నారు.

- ఐటీఐలో ప్రవేశానికి మూడో విడతలో భాగంగా అర్హులైన అభ్యర్థులకు దరఖాస్తుకు అవకాశం కల్పిస్తూ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు శ్రీరాంపూర్ ఐటిఐ ప్రిన్సిపాల్ టి సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● మంచిర్యాల అర్బన్: రైతులకు వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నామని మంచిర్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎన్ శ్రావణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ రఫతుల్లా, డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌లను మండల రేషన్ డీలర్లు శుక్రవారం సన్మానించారు.

● లక్షెట్టిపేటరూరల్: పాత కొమ్ముగూడలో వెంకట్రావుపేటలో వైద్యాధికారి సతీష్‌కుమార్ 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

● దండేపల్లి: తెలంగాణ రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(జీసీసీ) చైర్మన్ కోట్నాక తిరుపతి హైదరాబాద్‌లో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ శరత్, సీఎండి బలరామ్‌నాయక్‌న వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

- అంగన్‌వాడీ ఒకటో కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె వెంకటలక్ష్మి తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించారు.

- మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళల సమక్ష్యంలో సౌభాగ్యలక్ష్మికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాలు నిర్వహించారు.

● జన్నారం, తిమ్మాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం 1 టీచర్ సంజీవరాణి తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

● జైపూర్, మండల కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత అంగన్‌వాడీ టీచర్లు,సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు

● కోటపల్లి: మల్లంపేట గ్రామంలో డాక్‌కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాథోడ్ రామారావు నిర్వహించారు.

- మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ హాస్టల్, మోడల్ స్కూల్ హాస్టళ్లలో వైద్య శాఖ ఆధ్వర్యంలో దోమల నివారణ మందులను పిచికారి చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి అరుణశ్రీ దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై వసతి గృహాల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

- పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి తరలివెళ్లారు.

● మందమర్రిరూరల్: ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసి ఇటీవల వేరే ప్రాంతాలకు బదిలీ అయిన అధికారులను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఘనంగా శాలువాలతో సన్మానించారు.

● చెన్నూరు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని తుర్కపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. శుక్రవారం పాఠశాల విద్యార్థులను తీసుకువెళ్తున్న టాటాఏస్ వాహనం బురదలో కూరుకుపోయింది. స్థానికులు వాహనాన్ని బయటకు లాగారు.

● భీమారం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ. 30 వేలు ఉంటుందని యాజమాని తెలిపాడు.

● జన్నారం: మండల పశువైద్యాధికారిగా శ్వేత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విదులు నిర్వహించిన పశువైద్యాధికారి శ్రీకాంత్ బదిలీపై వెళ్లారు.

విద్యార్థుల ధర్నా

- మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని ఆవేదన



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

నస్పూర్, ఆగస్టు 2: నస్పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించిందని, పురుగులు వచ్చిన ఏవరూ పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం పాఠశాల ఎదుట ధర్నా చేశారు. మధ్యాహ్నం భోజనంలో పురుగులు, రాళ్ళు వస్తున్నయని నిర్వహకులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపిస్తూ బైఠాయించారు. మూత్రశాలలు సక్రమంగా లేవని, తాగునీరు కూడా సరిగా రావడంలేదని వాపోయారు. అధికారులు రావాలని, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయన్నారు. బియ్యంలో పురుగులు ఉన్నప్పటికి వాటిని శుభ్ర చేయకుండా వంట చేస్తున్నారని చెప్పారు. బియ్యంలో నాణ్యత లోపించిన వాటినే పంపిణీ చేస్తున్నారన్నారు. పాఠశాలలో విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు లేవని చెప్పారు. నేల మీద కూర్చోవాల్సి వస్తోందన్నారు. పాఠశాల తరగది గదులు వర్షాలకు ఉరుస్తున్నాయని, మరమ్మతులు చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని చెబితే మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులను బెదిరిస్తున్నారని తెలిపారు. తగిన చర్యలను చేపట్టకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు అభినవ్, అరవింద్, పీడీఎస్‌యూ నాయకుడు శ్రీకాంత్, ఏఐఎస్‌బీ నాయకుడు సన్నీగౌడ్ హెచ్చరించారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామోదర్ సంప్రదించగా మధ్యాహ్న భోజనం విషయం పై వచ్చిన ఫిర్యాదుపై నిర్వాహకులకు సూచన చేశామని చెప్పారు. బెంచీలు లేకపోవడం వలన విద్యార్థులు నేల మీద కూర్చుంటున్నారని తెలిపారు. మంచినీరు, మరుగుదొడ్లు ఉన్నాయని అన్నారు. కొత్తగా రూ. 50 లక్షలతో మరో బిల్డింగ్ నిర్మాణం జరుగుతుందన్నారు. పాత భవనాలు వర్షం పడినప్పుడు ఉరుస్తున్నాయని, మరమ్మతులు చేపడుతామని తెలిపారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

జైపూర్, ఆగస్టు 2: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 5 నుంచి చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వైద్య, విద్య, పం చాయతీ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు ఐకేపీ, ఉపాధి సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఈవో రాధాకృష్ణ, ఎంపీవో శ్రీపతి బాపు, మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా, డాక్టర్ శ్రావ్య పాల్గొన్నారు.

కోటపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, విద్య శాఖ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి మండల ప్రత్యేకాధికారి వినోద్ అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ, వైద్యాధికారిణి అరుణశ్రీ, ఏపీవో బాలయ్య పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వం ప్రతిస్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనంపై డీఆర్‌డీవో కిషన్ వైద్య, విద్య, అంగన్‌వాడీ, ఉపాధిహామీ, ఐకేపీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో,ఏపీవో, ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

ప్రజల రక్షణకే కమ్యూనిటీ పోలీసింగ్

కోటపల్లి, ఆగస్టు 2: ప్రజల రక్షణకే కమ్యూనిటీ పోలీసింగ్ చేపడుతున్నామని ఎస్ఐ రాజేందర్ అన్నారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని బొప్పారం గ్రామంలో శుక్రవారం కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెసల్ పార్టీ పోలీసులు గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలున్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులకు వివరించి సమస్యను పరిష్కరింపజేస్తామని ఎస్ఐ తెలిపారు. మావోయిస్టులు గ్రామాల్లోకి వస్తే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మంచిర్యాలలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు కోర్టు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఇందుకు కృషి చేసిన ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం, ప్రధాని నరేంద్రమోదీ కృషి వల్లనే వర్గీకరణ సాధ్యమైందని తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, తుల అంజనే యులు, జోగుల శ్రీదేవి, మల్లేష్, వెంకన్న, శ్రీనివాస్, మల్లేష్, హరికృష్ణ, శ్రీనివాస్,రాజు, రాజమౌళి, ప్రభాకర్, రాంచందర్, రాజబాబు, వెంకటేశ్వర్లు, దేవేందర్, తరుణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రప టాలకు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుందిల్ల సాయికుమార్ ఆధ్వర్యంలో మం డల అధ్యక్షుడు మంత్రి రామయ్య వెంకటి, కొప్పర్తి బాపు,శ్రావణ్, సంపత్, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మంచిర్యాల జిల్లా కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జీ శరత్, చిప్పకుర్తి జగన్ మాట్లాడుతూ 30 ఏళ్ల కల వర్గీకరణతో నెరవేరిందని తెలిపారు. అనంతరం టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రేగుంట చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సమ్మయ్య, మల్లేష్, దశరథం, చంద్రశేఖర్, రమేశ్, రాజు, ఐలయ్య, మల్లేష్, ప్రమోద్, బీఆర్ఎస్వీ నాయకులు తిరుపతి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: ఎస్సీ వర్గీకరణకు కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చిన సందర్భంగా అంబేద్కర్ కాలనీ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్ వద్ద శుక్రవారం సంబరాలను నిర్వహించారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కొప్పర్తి రాజం, నాయకులు కొయ్యల కొమురయ్య, శంకర్, దళిత గాయకులు కొప్పర్తి సురేందర్, రాజు, మహేష్, కొయ్యల వెంకటేశ్వర్, మాదుగుల రమేష్, కొప్పర్తి శంకర్, కొప్పర్తి సాగర్, గొడిసెల లింగయ్య, కొయ్య పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: వర్గీకరణ అనుకూలంగా సుప్రీంకోర్టు తీరునిచ్చిన నేపథ్యంలో నస్పూర్‌లోని అంబేద్కర్ కాలనీలో శుక్రవారం అంబేద్కర్ భవన్ వద్ద అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కొప్పర్తి రాజం, కొయ్యల కొమురయ్య, కొప్పర్తి సురేందర్, రాజు, మాదుగుల శంకర్, మహేష్, రమేష్, సాగర్, లింగయ్య, పోచయ్య పాల్గొన్నారు.


దండేపల్లి: ఎమ్మార్పీఎస్ మండ శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఆదిజాంబవ సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిదునూరి శంకర్ అన్నారు. మందమర్రిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సంబరాలను నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంబాల రాజనర్సు, పోశం, రాజనర్సు, పోశం, తిరుపతి, శంకర్, రాజ్‌కుమార్, మొగిలి, కుమారస్వామి రాజలింగు, నరేష్, రాజశేఖర్, ఉపేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.



మందమర్రిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు





సోషల్ మీడియా ఇన్‌చార్జీగా సంతోష్

చెన్నూరు, ఆగస్టు 2: తెలంగాణ మున్నూరు కాపు సంఘం చెన్నూరు మండల సోసల్ మీడియా ఇన్‌చార్జీగా మండలంలోని సుబ్బరాంపల్లి గ్రామానికి చెందిన తుపాకుల సంతోష్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర సోషల్ మీడి యా ఇన్‌చార్జీ ఎర్రం సంజీవ్‌పటేల్ నియామకపత్రం అందజేశారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.



వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 2: వర్షాకాలలో వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చెంగ్తు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్, పంచాయతీ వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు, ప్రజలకు వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలందించాలన్నారు. ఉప ఆరోగ్య కేంద్రాల పరిధిలో డెంగీ నిర్ధారణకు ఆర్ డీ పరీక్షలు నిర్వహించాన్నారు. ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛద నం-పచ్చ దనం కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, వైద్యఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు అనిత, ప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకుడు హరిశ్చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 2: రజక వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ సంగెపు హన్మంతు కోరారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా బట్టలు ఉతకడమే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారని, సంక్షేమానికి దూరంగా ఉంటున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా రజకుల జీవితాల్లో వెలుగులు రావడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రజకుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో ముస్కె చందర్, నర్సయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు. కాగా తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం మందమర్రి పట్టణాధ్యక్షుడిగా స్థానిక మార్కెట్ ఒకటో జోన్‌కు చెందిన గంగరాజు రాంచందర్ నియమితులయ్యారు.


మద్యం సేవించి వాహనాలు నడుపొద్దు


చెన్నూరు, ఆగస్టు 2: మద్యం సేవించి వాహనాలను నడపవద్దని పట్టణ సీఐ రవీందర్ సూచించారు. శుక్రవారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు పాటంచని వాహనదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుబ్బారావు, శ్వేత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.















వాగులో పడి ఒకరి మృతి


సత్తయ్య(ఫైల్)

భీమిని, ఆగస్టు 2: మండల కేంద్రంలో బహిర్భూమికి వెళుతూ మూర్ఛ రావడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని గ్రామానికి చెందిన కొవ్వూరు సత్తయ్య (47) అనే రైతు శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని వాగు వద్దకు బహిర్భూమికి వెళ్తున్నాడు. ఆ సమయంలో మూర్ఛ రావడంతో వాగులో పడి మృతి చెందాడు. సత్తయ్య ఇంటికి రాక పోవడంతో బంధువులు వాగు పరిసరాల్లో గాలించగా నీటిలో పడి ఉన్నాడు. కుటుంబీకులు బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. సత్తయ్యకు కొన్నేళ్లుగా మూర్ఛ వ్యాధి ఉందని కుటుంబీకులు చెప్పారు. విషయం ఎస్సై విజయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబీకుల వద్ద నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని కేసు నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 2: మహిళను హతమార్చిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. చున్నంబట్టివాడకు చెందిన నెల్లి విజయ అనే మహిళను ఆమె అల్లుడు శాతం వెంకటేష్ కుటుంబ కక్ష్యల నేపథ్యంలో మద్యం మైకంలో గత నెల 13వ తేదీన కత్తితో మెడపై పొడిచి హత్య చేశాడు. అనంతరం అదే కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు వెంకటేష్‌ను ఆసుపత్రిలో చేర్పించారు.ఆ కేసు విచారణలో ఉండగా నిందితుడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి జగిత్యాల లోని తన అన్న ఇంటికి తప్పించుకొని పారిపోయేందుకు యత్నించగా బస్ స్టేషన్ ఆవరణలో అరెస్టు చేశామని సీఐ చెప్పారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- నిధుల కేటాయింపులో ప్రభుత్వం ప్రాధాన్యం
- ఎమ్మెల్యే గడ్డం వినోద్

నెన్నెల, ఆగస్టు 2: నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా దశలవారీగా పనులు చేపడతామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండలంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పర్యటించి అన్ని సమస్యలను గుర్తిస్తున్నామన్నారు. అవసరమైన పనులను గుర్తించేందుకు ఇప్పటికే అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామన్నారు. నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తామని సీఎం హామి ఇచ్చారన్నారు. గత 15 ఏళ్లలో చేయని పనులను చేస్తున్నామన్నారు. ఎర్రవాగు బ్రిడ్జి నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజల రవాణా కష్టాలు తీరుతాయన్నారు. అనంతరం అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల సమన్వయంతో పనులు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో హరికృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు గట్టు మల్లేష్, నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, ఉయ్యాల మల్లిక, మల్లాగౌడ్, మోహీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

మండలంలో రూ. 8 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వినోద్ ప్రారంభించారు. నెన్నెల కేజీబీవీలో రూ. 5 లక్షలతో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. రూ.90 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించిన మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ క్వార్టర్లను ప్రారంభించారు బొప్పారంలో రూ. 80 లక్షలతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.. రూ.2 కోట్లతో ఎర్రవగు బ్రిడ్జీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండల కేంద్రంలో రూ. 30 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 2 : కమిషనరేట్ పరిధిలో ఎవరు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి శిక్షార్హులు కావద్దని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనరేట్‌లో గత ఏడు నెలల్లో నేరాల శాతం పెరిగిందని తెలిపారు. నలుగురు నిందితులకు జీవితకాలం శిక్ష పడిందని తెలిపారు. మొత్తం 49 కేసుల్లో 80మంది నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధించడం జరిగిందని పేర్కొన్నారు. 8,208 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు కాగా 1,652 మందిని కోర్టులో హాజరుపరుచామని తెలిపారు. వారికి రూ.24,33,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

భీమిని, ఆగస్టు 2: యువత వ్యసనాల బారిన పడొద్దని ఎస్సై విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని చిన్నగుడిపేట గ్రామంలో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలన్నారు. గ్రామంలోకి అనుమానితులు వస్తే పోలీసులకు సమా చారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై తిరుపతి, సిబ్బంది రాజ్‌కుమార్, పోచమల్లు, మల్లేష్ పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో ర్యాలీ

బెల్లంపల్లి, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి కాంటా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

కార్యదర్శికి సన్మానం

కాసిపేట, ఆగస్టు 2: పెద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఆరు సంవత్సరాలు సేవలందించి బదిలీపై వెళ్తున్న నాగరాజు, ఏఎన్‌ఎం పద్మను శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో స్థానికులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు వేముల కృష్ణ, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, నాయకులు సోమని మైసక్క, రమేశ్, తిరుపతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమ శిక్షణతో చదవాలి

హాజీపూర్, ఆగస్టు 2: విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదాగాలని హాజీపూర్ ఎస్‌ఐ సురేష్ అన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మౌంట్ కార్మెల్ పాఠశాలలో నిర్వహించిన సెమినార్ కార్యక్రమానికి ఎస్‌ఐ హాజరై మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. లక్ష్యం కోసం క్రమశిక్షణ పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో

సింగరేణి కార్మికుడి మృతి

నస్పూర్, ఆగస్టు 2: నస్పూర్‌లోని జాతీయ రహదారి-363 పై సీసీసీ, దొరగారిపల్లి మధ్య శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైరి శ్రీనివాస్ (31) అనే సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపూర్‌లోని కుర్మపల్లికి చెందిన శ్రీనివాస్ గోదావరిఖని (జీడీకే-1ఇంక్లైన్)లో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్నాడు. విధులకు వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదానికి గురయ్యాడు. శ్రీనివాస్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి కారు ఢీకొట్టడంతో ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయాడు. ఆ వెనుకనే లారీ రావడం రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో నుజ్జును జ్జుయ్యాయి శ్రీనివాస్‌ను 108లో మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా ప్యాకెట్లు పట్టివేత

మందమర్రిరూరల్, ఆగస్టు 2 : మండలంలోని పొన్నారం గ్రామంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 60 గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. బర్ల సత్తమ్మ అనే మహిళ గుడుంబా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేయగా ఇంటి వెనకాల ఉన్న పెరట్లో 60 గుడుంబా ప్యాకెట్లు దొరికిన ట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

లక్సెట్టిపేటరూరల్, ఆగస్టు 2: మండలంలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి శంకర్ ఆదేశించారు. శుక్రవారం జెండా వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదివాసీ తలమల కొలాంగూడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించారు. అనంతరం తలమల, చెల్లంపేట ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల గడువు పూర్తయ్యిందని, మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని గ్రామైక్య సంఘాలను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్య పుస్తకాలు చదివించి బ్లాక్‌బోర్డులో ఉన్న అక్షరాలను చెప్పించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్కూరు చౌరస్తాలోని ఎస్‌బీఐ బ్యాంకును సందర్శించి బ్యాంకు పరిధిలో ఎంత మంది రైతులకు రుణమాఫీ జరిగిందని ఆరా తీశారు. అనంతరం లక్సెట్టిపేటలోని రాజరాజేశ్వర ఫెర్టిలైజర్‌కు వెళ్లి ఎరువుల స్టాక్‌రూంలు, స్టాక్ రిజిస్టర్‌లను, విక్రయాల రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో సరోజ, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వెంకటరమణ, వైద్యురాలు సుమలత, టెక్నికల్ అసిస్టెంట్ రాజన్న, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, మౌనిక పాల్గొన్నారు.

పంట రుణాలు సకాలంలో అందించాలి

కాసిపేట, ఆగస్టు 2: అర్హులైన రైతులందరికి పంట రుణాలను సకాలంలో అందించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీటీడీవో గంగారాం అన్నారు. శుక్రవారం దేవాపూర్‌లోని యూనియన్ బ్యాంకు అధికారులతో మాట్లాడారు. రెండు విడతల్లో రుణమాఫీ పొందిన రైతులకు బ్యాంకు అధికారులు మళ్లీ పంట రుణాలను అందజేయాలని సూచించారు. అనంతరం దేవాపూర్‌లోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేశారు.

- మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

మహిళలు అన్ని రంగాల్లో ముందున్నప్పుడు సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని మండల ప్రత్యేకాధికారి గంగారాం అన్నారు. శుక్రవారం దేవాపూర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని, దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందన్నారు. ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేవాపూర్ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో సప్దర్‌ఆలీ, వ్యవసాయాధికారి వందన , పంచాయతీ కార్యదర్శి కవిత, వైద్య సిబ్బంది ఉన్నారు.

కోతుల నుంచి రక్షించండి


కెరమెరిలో జనవాసాల్లో సంచరిస్తున్న కోతులు

కెరమెరి, ఆగస్టు 2: మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువైందని వాటి నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. కోతులు ఇళ్లలోకి చొరబడి కూరగాయలు, పప్పు దినుసులు, విలువైన వస్తువులను తీసు కెళ్తున్నా యనిపేర్కొన్నారు. గుంపులు గుంపులుగా కోతుల ఇళ్లపై దాడి చేస్తున్నా అధికారులు రక్షణ చర్యలు చేపట్టడం లేదన్నారు. వెంటనే అధికారులు వాటినిపట్టుకుని అటవీప్రాంతంలోవదిలేయాలని కోరుతున్నారు.

పాఠశాలలో పారిశుధ్య లోపం

పెంచికలపేట, ఆగస్టు 2: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులకు పాఠాలు బోధించే పాఠశాలలోనే పారిశుధ్యం లోపించింది. మండలకేంద్రంలోని జడ్పీఉన్నత పాఠశాలలో గల మరుగుదొడ్ల వద్ద గడ్డి పెరిగింది. ఇటీవల కురిసినవర్షాలకు గ్రామంలోని ప్రధానవీధుల్లోని వర్షపునీరు సైతం పాఠశాలలోకి చేరడంతో పరిసరాలు బురదమయంగా మారి గడ్డిఏపుగా పెరిగింది. దీంతో దోమలు వ్యాప్తిచెంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు విషజ్వరాల బారిన పడకముందే పారిశుధ్య పనులు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


పాఠశాల ఆవరణలో మొలిచిన గడ్డి

మండలంలో హడలెత్తిస్తున్న కుక్కలు


గ్రామాల్లో సంచరిస్తున్న కుక్కలు

పెంచికలపేట, ఆగస్టు 2: మండలంలోని గ్రామాల్లో ఏ వీధికి వెళ్లినా కుక్కలు గుంపులుగా తిరుగుతూ హడలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా మండలకేంద్రంలో కుక్కల అలజడి అధికంగా ఉంది. పిల్లలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. వాహనంపై ప్రయాణిస్తున్న ప్రజలను వెంబడిస్తున్నాయి. గడిచిన 5,6నెలల్లో సుమారు 80కి పైగా కుక్కకాటు కేసులు ప్రాథమికఆరోగ్యకేంద్రానికి వచ్చినట్లు సిబ్బంది తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్గీకరణతో ఎస్సీ ఉపకులాలకు న్యాయం

సిర్పూర్(యు), ఆగస్టు 2: వర్గీకరణతో ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు జిలెపల్లి శంకర్, కొత్తూరి ఆంధ్రయ్య అన్నారు. ఎస్సీ కులాల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చిట్యాలశంకర్, కేరబా తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట: మండలంలోని కొండపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ న్యాయమైనదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో వారు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, పాపయ్య, సునీల్, ప్రవీణ్, అంజి, పెంటయ్య, రాహుల్, శేఖర్ పాల్గొన్నారు.

'కనీసవేతనం చెల్లించాలి'

రెబ్బెన, ఆగస్టు 2: రాష్ట్రంలో గ్రామీణపేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న వీవోఏలకు కనీస వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఐకేపీలో వీవోఏలకు కనీసవేతనం అమలుచేయాలన్నారు. వీరికి జీతాలతోపాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు.

వీవోఏల యూనియన్ ఏర్పాటు..

వీవోఏల యూనియన్ చేసినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా లింగన్న, అధ్యక్షుడిగా గజెల్లి భీమేష్, ఉపాధ్యక్షులుగా తిరుపతి, నసీమా, ప్రధానకార్యదర్శిగా మైలారపు శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

తల్లిపాల వారోత్సవాలు


సిర్పూర్(యు)లో మాట్లాడుతున్న సీడీపీవో ఇందిర

సిర్పూర్(యు), ఆగస్టు 2: మండలంలోని పంగడి గ్రామంలో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో ఇందిర మాట్లాడుతూ మొట్టమొదటగా వచ్చే ముర్రుపాలు బిడ్డకు తొలి టీకా లాంటిదన్నారు. ఇవి వ్యాధినిరోధక శక్తి కల్గి ఉంటా యన్నారు. ఆరునెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సోంబాయి, అంగన్‌వాడీటీచర్లు జయమాల, మంగావతి, శాంత, జంగుబాయి, ఈశ్వరి, సుభద్ర పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బంధీగా చేపట్టాలి'

బెజ్జూరు, ఆగస్టు 2: పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో గౌరిశంకర్ అన్నారు. శుక్రవారం కార్యదర్శులకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కార్యదర్శులకు ఎంపీడీవో అవగాహన కల్పించారు. అటవీ, వ్యవసాయశాఖ, మండలపరిషత్ అధికారుల సంయుక్తంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 5నుంచి 9వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రాజులనాయుడు, రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి


మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి

బెజ్జూరు, ఆగస్టు 2: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. గట్టిగా ప్రయత్నం చేస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు అవకాశం ఉంటుందని ఆ దిశగా ప్రతికార్యకర్త సైనికుడిగా పనిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు సుధాకర్ రావు, మనోహర్‌గౌడ్, తిరుపతి, బాలకృష్ణ, ఎస్.తిరుపతి పాల్గొన్నారు.

జీతాల కోసం ఉద్యోగుల నిరసన

కాగజ్‌నగర్, ఆగస్టు 2: జీతాలు చెల్లించాలని శుక్రవారం మిషన్ భగీరథలో పనిచేసే సూపర్‌వైజర్లు, పంపు ఆపరేటర్లు, వాల్వ్ ఆపరేటర్లు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదునెలల నుంచి జీతాలు ఇవ్వటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని కోరారు.


జీతాలు చెల్లించాలని నిరసన చేస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది

గుండెపోటుతో సీనియర్ పాత్రికేయుడు మృతి


ఆసీఫ్ అలీ(ఫైల్)

కాగజ్‌నగర్, ఆగస్టు 2: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సీనియర్ ఉర్దూ పాత్రికేయుడు ఆసీఫ్ అలీ(64) గురువారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. కొన్నిరోజుల క్రితం ఇంటి ఆవరణలో ప్రమాదవశాతు కిందపడి పోవటంతో చికిత్స నిమిత్తం కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గుండెపోటుతో గురువారం మృతి చెందారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీచైర్మన్ ఇస్మాయిల్ అలీఖాన్, స్థానిక పాత్రికేయులు పాల్గొన్నారు. ఆసీఫ్‌అలీ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

సంక్షిప్తం..

బదిలీ అయిన అటవీశాఖ సిబ్బందికి సన్మానం

వాంకిడి: మండలంలోని వివిధప్రాంతాల్లో అటవీ శాఖలో పనిచేసి బదిలీపై వెళ్తున్న భగవంతరావు, లక్ష్మణ్, సత్యనారాయణ, శ్రీవిద్యను అటవీశాఖసిబ్బంది శుక్రవారం డిప్యూటీరేంజ్ అధికారి సరోజారాణి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోరామ్మూర్తి, చెక్‌పోస్టు వాచర్లు నగేష్, టెమజీ, సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

'బీసీ డిక్లరేషన్ అమలు చేసి ఎన్నికలు జరపాలి'

కౌటాల: కామారెడ్డిలో ఇచ్చినహామీ మేరకు బీసీ డిక్లరేషన్ అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీసీ సంక్షేమసంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ ముదిరాజ్ కోరారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో లక్షకోట్లు కేటాయిస్తామని చెప్పి రూ.9200కోట్లు కేటాయించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, శ్రీశైలం, శంకర్, శ్రీను, విస్తారు, నగేష్, భీమక్క పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

పెంచికలపేట: మండలంలోని లోడ్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్‌నాయకుడు బుర్స రామయ్య గురువారం రాత్రిమృతిచెందడంతో విషయం తెలుసుకున్న మాజీసర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్ బాధితకుటుంబాన్ని పరామర్శించి రూ.4 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నూతన అధ్యక్షుడికి సన్మానం

పెంచికలపేట: మండలకేంద్రంలో నూతన బీజేపీ ఓబీసీమోర్చా మండలాధ్యక్షుడిగా ఎన్నికైన రౌతుభుజంగరావును శుక్రవారం బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పురుషోత్తం, సంతోష్, కాంతారావు, శోభన్, శ్రీకాంత్, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుకు ప్రతిపాదనలు తయారు చేయాలి

సిర్పూర్(టి): సిర్పూర్(టి)లోని గ్రంథాలయ మరమ్మతుకోసం పంచాయతీరాజ్‌శాఖ ద్వారా ప్రతిపాదనలు తయారుచేయాలని ఏఈ ఆత్మారాంను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ సూచించారు. వర్షాలకు గ్రంథాలయం ఊరుస్తుండడంతో గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. శనివారం గ్రంథాలయ ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టాలని కార్యదర్శిని ఆదేశించారు.

5వరకే రైతుబీమాకు అవకాశం

కాగజ్‌నగర్: రైతుబీమాకు ఈనెల5వరకే అవకాశం ఉందని వ్యవసాయ విస్తరణ అధికారి శైలేష్ కుమార్ తెలిపారు. రైతులు పట్టాపాస్ బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, నామినీ యొక్క ఆధార్‌కార్డుతో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. రైతులు గడువు లోగా దరఖాస్తులు చేసుకుంటేనే బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు.

స్వచ్ఛదనం పచ్చదనం పకడ్బందీగా నిర్వహించాలి

లింగాపూర్: గ్రామాల్లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం మండలాధికారులకు ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


'సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి'

ఆసిఫాబాద్, ఆగస్టు 2: ఈనెల13నుంచి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల13న మూగ, చెవిటి, మానసికవైకల్యం, 16న కంటిచూపు, 27న ఎముకల సంబంధిత సమస్యలుగల వారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు. ముందుగా సంబంధిత ప్రాథమిక ఆరోగ్యసేవా కేంద్రాల్లో వికలత్వం పరీక్ష చేయించుకుని మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని సదరం శిబిరానికి నిర్ణీత తేదీలలో హాజరు కావాలన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం


సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్, ఆగస్టు 2: ఆసిఫాబాద్ రేంజ్‌పరిధిలో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న ఎఫ్ఆర్వో అప్పలకొండ, సెక్షన్, బీట్ అధికారులు సత్యనారాయణ, భగవంతరావు, లక్ష్మణ్, స్వప్న, రవి, మహేష్, రజిత, శ్రీనివాస్‌ను సిబ్బందిఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్వోయోగేష్ మాట్లాడుతూ సాధారణ బదిలీలో సిబ్బంది ఒకేసారి వెళ్లడం కుటుంబసభ్యులకు దూరమవుతున్నామన్న బాధ కలుగుతోందన్నారు. సమావేశంలో డీఆర్వోసరోజరాణి, సిబ్బంది సాయి పాల్గొన్నారు.

పెద్దవాగు వంతెనకు మరమ్మతులు చేపట్టాలి


మాట్లాడుతున్న లెండుగురే శ్యాంరావు

కాగజ్‌నగర్, ఆగస్టు 2: కాగజ్‌నగర్-ఆసిఫాబాద్‌కు వెళ్లే మార్గంలోని పెద్దవాగు వంతెనకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్ సిర్పూరు నియోజవకర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు డిమాండు చేశారు. శుక్రవారం పెద్దవాగు బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దవాగు బ్రిడ్జివంతెన పూర్తిగా రంధ్రాలు పడిందన్నారు. వాహనాలు వెళ్లినపుడు ప్రకంపనాలు వస్తున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే వంతెనకు మరమ్మతులు చేయాలన్నారు. రాత్రిళ్లు బ్రిడ్జిపై నుంచి ప్రైవేటు బస్సులు వెళ్లకుండా చూడాలని డిమాండు చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అంబాల ఓదెలు, నక్క మనోహర్, మోయాన్, సలీం, ఆవుల రాజ్‌కుమార్, కన్నయ్య, రాజు పాల్గొన్నారు.

'ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి'

జైనూర్, ఆగస్టు 2: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనక యాదవ్‌రావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జైనూర్ మండల కేంద్రలో నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి చేపట్టవాల్సిన విషయాలను చర్చించారు. సమావేశానికి జైనూర్ మండలంతోపాటు సిర్పూర్(యు), లింగాపూర్ మూడు మండలాల ఆదివాసీలు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాయిసంటర్ల సార్మెడిలు జుగ్నాక దేవరావు, ఆత్రం ఆనంద్‌రావు, మాజీ సర్పంచులు నాగోరావు, భీంరావు,రాహుల్,నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా నిర్వహణ కమిటీకి చైర్మన్‌గా కనక యాదవ్‌రావు, గౌరవచైర్మన్‌గా మెస్రం మోతీరాంను ఎన్నుకున్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

కాగజ్‌నగర్, ఆగస్టు 2: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస తరంగిణి, ట్రస్మా సహకారంతో జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు శుక్రవారం కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంటు పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో వందమంది వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ క్వాలిటి కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ వేదిక ఉపకరిస్తోందన్నారు. కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు దేవభూషణం, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిల కోసం పోరుబాట


కాగజ్‌నగర్‌లో సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

- కట్టాల్సిన పీఎఫ్ డబ్బులు రూ.2కోట్లు
- ఈఎస్‌ఐ డబ్బులు రూ.40లక్షలు
- నాలుగు నెలల నుంచి జీతాలు కూడా లేవు
- దినదినగండంగా మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల జీవనం

కాగజ్‌నగర్, ఆగస్టు 2: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారించాలని కోరుతూ పది రోజుల నుంచి కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మెబాట పట్టారు. మున్సిపాల్టీలో పనిచేస్తున్న 145మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల నుంచి జీతాలు చెల్లించలేదు. అలాగే వీరికి చెల్లించాల్సిన ఈఎస్‌ఐ, పీఎఫ్ డబ్బులు కూడా ఇంతవరకు ఆయా కార్పొరేషన్లకు కట్టలేదు. రెండేళ్ల నుంచి ప్రావిడెంట్ ఫండ్ కార్పొరేషన్‌కు రూ.2 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. అలాగే ఈఎస్‌ఐ కార్పొరేషన్‌కు రూ.40 లక్షల మేర డబ్బులు కట్టాల్సి ఉంది. వాటిని చెల్లించేంత వరకు విధులు నిర్వహించమని సమ్మెబాట పట్టారు. దీంతో పట్టణంలో పారిశుధ్యం పేరుకుపోతోంది. ఒకవైపు వర్షాలు మరోవైపు పారిశుధ్య పనులు జరుగకపోవటంతో ఆయావార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పోరుబాట..

కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో 145 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.12వేల జీతం ఇస్తుండగా, ఇందులో రూ.1200 మేర ఈఎస్‌ఐ, పీఎఫ్ పేరిట కోత విధిస్తున్నారు. ఈఎస్‌ఐ కార్పొరేషన్‌కు డబ్బులు చెల్లించక పోవటంతో కాంట్రాక్టు కార్మికులకు వైద్యసేవలు సరిగా అందటం లేదు. కేవలం జ్వరం, జలుబు తదితర వాటికి మాత్రమే మాత్రలిచ్చి పంపిస్తున్నారని పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ఎప్పుడు ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి ఉండగా, తమకు విషసర్పాల నుంచి కూడా హాని పొంచి ఉందని పేర్కొంటున్నారు. అధికారులు తమ ప్రాణాలతో ఆడుకుంటున్నారని మండిపడుతున్నారు. తాము విధుల్లో చేరమని తేల్చి చెబుతున్నారు. తమ బకాయిలు క్లియర్ చేయాలని డిమాండు చేస్తున్నారు. నాలుగు నెలలుగా జీతాలు లేకపోవటంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

పది రోజుల నుంచి విధులను బహిష్కరించాం..

శంకరమ్మ, కాంట్రాక్టు కార్మికురాలు



నాలుగు నెలల నుంచి మాకు జీతాలు ఇవ్వటం లేదు. జీతాల్లో కోత విధించిన ఈఎస్‌ఐ, పీఎఫ్ డబ్బులు ఇంతవరకు ఆయా కార్పొరేషన్లకు కట్టలేదు. నాలుగు నెలల నుంచి జీతాలు కూడా ఇవ్వడం లేదు.మా సమస్యలు పరిష్కరించే వరకు విధుల్లో చేరం.

సమస్యలు వివరించినప్పటికీ కూడా..

సంజీవ్, కాంట్రాక్టు కార్మికుడు



అధికారుల నిర్లక్ష్యంతో జీతాలు చెల్లించడం లేదు. చాలా కష్టంగా ఉంది. ఇప్పటికీ పది రోజులు గడుస్తోంది. మా సమస్యను ఆలకించిన వారు లేరు. అధికారులు మా సమస్యలు పరిష్కరించే వరకు విధులు బహిష్కరించి ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నాం.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మున్సిపాల్టీ కాంట్రాక్టు కార్మికుల సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పెండింగ్ బకాయిల విషయంలో కూడా నివేదిక పంపించాం. ఉన్నతాధికారుల నుంచి తదుపరి ఆదేశాల కోసం వేచి చూస్తున్నాం. నిధులు రాగానే క్లియర్ చేస్తాం.

ఇంటింటా ఇన్నోవేషన్-2024 దరఖాస్తు గడువు పొడగింపు

ఆసిఫాబాద్, ఆగస్టు 2: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేషన్-2024 కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 10వరకు గడువు పొడగించామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణప్రాంతాల నుంచి ప్రజా ఉపయోగకరమైన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రతిఆవిష్కర్త దరఖాస్తు చేసుకోవాలన్నారు. గొప్ప ఆవిష్కరణలను ఎంపికచేసి ఆగస్టు15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డు ప్రదానం చేస్తామన్నారు. ఆవిష్కర్తలు దరఖాస్తులను నేరుగా వాట్సాప్ ద్వారా 9100678543కి పంపించాలన్నారు.

వ్యవసాయరంగ అభివృద్ధికి విద్యుత్ కనెక్షన్లు మంజూరు: ఎస్ఈ

ఆసిఫాబాద్, ఆగస్టు 2: వ్యవసాయరంగ అభివృద్ధికి విద్యుత్ కనెక్షన్ కొరకు రైతులు చేసుకున్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి సర్వీస్ కనెక్షన్‌లు మంజూరు చేయాలని ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్ఈ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు1, 2022నుంచి జూలై 31,2023 వరకు 785, డిసెంబరు 1,2023నుంచి జూలై 3,2024వరకు 883 సర్వీసులు మంజూరు చేశామన్నారు. సర్వీసుల మంజూరు ప్రక్రియ ఆన్‌లైన్ చేయడం ద్వారా దరఖాస్తుల స్థాయి పరిశీలిస్తూ ఆలస్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఇంటింటికి తపాలా సేవలు

- తపాలా శాఖ జిల్లా అధికారి వెంకటస్వామి

కెరమెరి, ఆగస్టు 2: గ్రామీణప్రాంతాల్లో ఇంటింటికి తపాలా సేవలను అందిస్తామని జిల్లా అధికారి వెంకటస్వామి అన్నారు. శుక్రవారం గోయగాం గ్రామంలో తపాలసేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో తపాలా శాఖను బలోపేతం చేసేందుకు కేంద్రప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో బీపీఎం శ్రీనివాస్, ఏపీఎం బాలాజీ, గ్రామస్తులు శంకర్, బాపూజీ, పోశెట్టి, బుచ్చన్న, సందీప్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 2: ప్రభుత్వం ఈనెల 5నుంచి 9వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు, అటవీశాఖ, ఈజీఎస్, ఐకేపీ, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో నిర్వహించే కార్యక్రమానికి ప్రజాప్రతినిదులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మండలస్థాయి అధికారులు పాల్గొనడంతోపాటు ప్రజలను భాగస్వామ్యం చేసి కార్యక్రమాన్ని విజయతానికి కృషి చేయాలన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఈక్రమంలో మున్సిపల్, గ్రామస్థాయిలో ప్రత్యేక బృందాలను నియమిస్తామన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధిపై దృష్టి సారించాలి..

జిల్లాలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ జిల్లానుంచి వివిధరకాల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశానికి జిల్లా గ్రామీణఅభివృద్ధి సురేందర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ వివిధ రకాల ఉత్పత్తుల ఎగుమతులను చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎగుమతి చేయగలిగిన ఉత్పత్తులను గుర్తించాలని, జీఐ ట్యాగ్ కలిగిన డోక్రా కాస్టింగ్ ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చన్నారు. తృణధాన్యాలలో జొన్న పంట సాగుకు జిల్లా వాతావరణం అనుకూలమైందన్నారు. జిల్లాలో తయారు చేయబడిన ఆహార పదార్థాలను కూడా ఎగుమతి చేయవచ్చన్నారు. వెదురు ఉత్పత్తుల ద్వారా తయారు చేయబడిన ఉత్పత్తులను సైతం ఎగుమతి చేసేందుకు వీలుంటుందన్నారు. వీటితోపాటు పుట్టగొడుగుల పెంపకం ప్రోత్సహించడం ద్వారా జిల్లా నుంచి ఎగుమతి సాధ్యపడుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రెడీమేడ్ గవర్నమెంట్ యూనిట్ స్థాపించి ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చన్నారు. జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, నాబార్డు డీడీఎం వీరభద్రుడు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి..

తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖాధికారి భాస్కర్‌తోకలిసి తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపు తల్లి ముర్రుపాలు తాగిస్తే చిన్నారుల ఎదుగుదల, రోగనిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ సూపరింటెండెంట్ పుష్పలత, జిల్లా పోషన్ అభియాన్ సమన్వయకర్త గోపాలకృష్ణ, సిబ్బంది స్వప్న, శారద, పెంటుబాయి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి ప్రమాదం చేస్తే మర్డర్ కేసు: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్

ఆసిఫాబాద్, ఆగస్టు 2: మద్యం తాగి వాహనం నడిపి ప్రమాదం చేస్తే లేదా రాంగ్ రూట్‌లో వచ్చి ప్రమాదం చేస్తే జూలై1 నుంచి వచ్చిన నూతన చట్టాలలో ఉన్న నిబంధనల మేరకు మర్డర్ కేసు నమోదు చేస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రం లోని ప్రేమలగార్డెన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డుభద్రత, ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు, రవాణా శాఖాధికారి రాంచందర్, డీఎస్పీ సదయ్యతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో గత సంవత్సరంలో వివిధ ప్రమాదాల్లో 80మంది చనిపోగా 150మంది గాయపడ్డారన్నారు. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటికే 40 మంది చనిపోయారని అన్నారు. దీనికి అతివేగం, మద్యం తాగి వాహనం నడపడం ముఖ్యమైన కారణమన్నారు. రానున్న రోజుల్లో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తు న్నట్లు తెలిపారు. ఏఎస్పీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఆటోలు, పాఠశాలల బస్సుల్లో రద్దీ ప్రయాణం చేయకూడదన్నారు. డీటీవో రాంచందర్ మాట్లాడుతూ పోలీసు కోరిక మేరకు జిల్లాలో ఆగస్టులో నెల రోజులపాటు ప్రత్యేకడ్రైవింగ్ లైసెన్సు డ్రైవ్ నిర్వహించి రోజు ఐదుగురికి డ్రైవింగ్ లైసెన్సులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస్, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

మహిళలు సమస్యలపై నిర్భయంగా సంప్రదించాలి..

మహిళలు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, హింసకు గురైతే జిల్లా షీటీంను లేదా డయల్ 100ను సంప్రదించాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం షీటీం, యాంటీఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయ పడోద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిదితులపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా నెలలో షీటీం ద్వారా మూడు కేసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, అలాగే 28అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు,పిల్లలు వేధింపులకు గురైనట్లయితే షీటీం 8712670564లేదా డయల్100కు సమాచారం అందించాలన్నారు.

'గిరిజన విద్యను మెరుగుపరుస్తాం'

జైనూర్, ఆగస్టు 2: గిరిజన విద్యను మెరుగుపరుస్తామని పీజీ హెచ్ఎం ఆత్రం పార్వతీబాయి అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పీజీహెచ్‌ఎంగా ఆత్రం పార్వతీబాయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించిన హెచ్ఎం ఆత్రం భాస్కర్ బదిలీ అయ్యారు. ఆయనను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఆత్రం పార్వతీబాయికి సైతం ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మండాడి సోనేరావ్, జాదవ్ గజానంద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి


కాగజ్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్, ఆగస్టు 2: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని డీఎస్పీ కరుణాకర్ అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించటం ద్వారా భావితరాల వారికి కాలుష్య రహిత సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐశంకరయ్య, ఎస్సైలు మహేందర్, అంజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటిసంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

కౌటాల: విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించాలని సీఐ సాదిక్‌పాషా అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఆయన డిగ్రీ కళాశాల విద్యార్థులు, పోలీసు శాఖ సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.



కైరిగూడను సందర్శించిన ఐఎన్‌టీయూసీ నాయకులు

రెబ్బెన, ఆగస్టు 2: బెల్లంపల్లి కైరిగూడ ఓపెన్‌కాస్టును శుక్రవారం ఐఎన్‌టీయూసీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా వైస్‌ప్రసిడెంట్ పేరం శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీఎం ప్రవీణ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కైరిగూడ పిట్‌సెక్రెటరీ భాస్కరాచారి, మాసాడి నారాయణ, మాధవకృష్ణ, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆధార్, పాన్ కార్డులు అనుసంధానం చేసుకోండి'

శ్రీరాంపూర్, ఆగస్టు 2: ఆధార్, పాన్ కార్డులు అనుసంధానం చేసుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా కోరారు. ఎస్ఆర్పీ3 గనిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఏరియా కార్మికులు కొంతమంది తమ పాన్‌కార్డులకు ఆధార్‌కార్డులు అనుసంధానం చేసుకోలేదన్నారు. అలాంటి కార్మికులకు జరిమానా విధిస్తూ ఆదాయపన్ను శాఖ నోటీసులు పంపిందని, ఆ ప్రకారం వేతనాల నుంచి రికవరీ అవుతుందన్నారు. ఈవిషయాన్ని గమనించి అనుసంధానం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయకార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, పిట్ కార్యదర్శి మురళీచౌదరి, ఎస్ఆర్పీ3 ఉపాధ్యక్షుడు తోట మల్లేష్, సహాయకార్యదర్శి అంబాల రవి, నాయకులు పాల్గొన్నారు.

'సింగరేణి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలి'

బెల్లంపల్లి, ఆగస్టు 2: బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలని శుక్రవారం ఏరియా సింగరేణి ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నాయకులు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం అందించారు. ఆసుపత్రిలో డాక్టర్‌లను, స్పెషలిస్టులను, సిబ్బందిని నియమించాలని, ఫార్మసీస్టోర్‌ను తెరిపించి అన్నిరకాల వైద్యసేవలను అందేవిధంగా కృషి చేయాల న్నారు. వెంటనే సింగరేణి ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, రాజమౌళి, జయరాంయాదవ్, మహ్మద్ అఫ్జల్ మణిరాంసింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ఎత్తివేస్తే ఊరుకునేది లేదు..

మందమర్రిటౌన్: బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఎత్తివేస్తే సహించేది లేదని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిని తొలగించే కుట్రలు చేయడం సరైంది కాదన్నారు. బెల్లంపల్లిలో పలు డిస్పెన్సరీలను మూసివేశారని, దీంతో కార్మికులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. ఆసుపత్రిలోని పలు వార్డులను సైతం మూసివేశారని పేర్కొన్నారు. ఆసుపత్రిని అభివృద్ధి చేసి డాక్టర్‌లను,సిబ్బందిని నియమించి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

అమ్మపాలే అమృతం..

- బిడ్డకు పాలిస్తే తల్లికీ ఆరోగ్యం
- 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు

వాంకిడి, ఆగస్టు 2: తల్లిపాలే పిల్లలకు అమృత తుల్యం. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయి. నవజాత శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాలేనని నిపుణులు కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిపాల ఆవశ్యకతను తెలుపుతూ ప్రభుత్వం ఏటా వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఐసీడీఎస్ శాఖ నేటి నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలను చేపట్టనుంది.

- మొదటి రెండు రోజులు కీలకం

బిడ్డపుట్టిన మొదటి రెండు రోజులు ఎంతో కీలకమని వైద్యనిపుణులు చెబుతున్నారు. పుట్టిన కొద్దిసేపటికే ముర్రుపాలు తాగేలా చూడాలి. ఈ రోజుల్లో ఇచ్చే పాలల్లో కొలెస్ట్రాల్ ఉంటుంది. ఇందులో రోగనిరోధక శక్తి పెంచే అంశాలు ఉంటాయి. బిడ్డ పలురకాల వ్యాధుల బారిన పడకుండా ఎంతగానో దోహదపడుతుంది. దీంతో పాటు ఆరు నెలల వరకు తల్లి పాలను మాత్రమే అందించాలి.

- తల్లికి పోషకాలు అవసరం

ప్రసవం తరువాత తల్లి పోషకాహారం తీసుకుంటే బిడ్డకు కూడా అలాంటి ఆహారాన్ని అందిచేందుకు అవకాశం ఉటుంది. రోజు 600గ్రాముల అన్నం, 200గ్రాముల పప్పు, 150గ్రాములకూరలు, ఉడకబెట్టిన గుడ్డు, ఓపండు, 100మిల్లీలీటర్ల పాలు తీసుకోవాలి. ప్రతిరోజు ఆహారంలో పప్పు, ఆకుకూరలు పీచు పదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

● తల్లిపాల వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి

- రిబ్కా, సీడీపీవో



ఆగస్టు1 నుంచి 7వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలి. వారం రోజుల పాటు ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో కార్యక్రమం జరుగుతుంది. తల్లిపాల వారోత్సవాలు విజయవంతమయ్యేలా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలి.

ఐదు నుంచి స్వచ్ఛదనం- పచ్చదనం

కెరమెరి/తిర్యాణి/సిర్పూర్(టి)/దహెగాం, ఆగస్టు 2: మండలాల్లో ఈనెల5 నుంచి 9వరకు నిర్వహించే స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారులు లక్ష్మినారాయణ, రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గ్రామాల్లో మురికికాలువల చివరలో కమ్యూనిటీ సోసర్‌పిట్ కోసం స్థలాలను గుర్తించాలన్నారు. అలాగే మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటాలన్నారు. గ్రామస్థాయి అధికారులందరు ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి రక్షించాలన్నారు. కెరమెరిలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో అంజద్‌పాషా, ఏపీవో మల్లయ్య, ఏవో గోపికాంత్, ఏఈ విశ్వేశ్వర్, తిర్యాణిలో ఎంపీడీవో మల్లేష్, డీటీ వంశీకృష్ణ, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఏపీఎం సదానందం, ఏపీవో షాకీర్‌హుస్సేన్, కార్యదర్శులు,సిర్పూర్(టి)లో ఎంపీడీవో సత్యనారాయణ, డీటీ బక్కయ్య, ఎఫ్ఆర్వో పూర్ణచందర్, డాక్టర్ నవత, ఏపీవో చంద్రయ్య, ఏపీఎం దుర్గయ్య, ఈసీ నగేష్, సీసీలు, టీఏలు, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, దహెగాంలో ఎంపీడీవో రాజేందర్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.


కెరమెరిలో సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మినారాయణ